క్లుప్తంగా

యూజర్ చార్జీలు, ప్లాస్టిక్ నిషేధంపై డ్రైవ్



షాపు యజమానులతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో రాజేష్

మర్రిపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధి కంచరపాలెం నుంచి మర్రిపాలెం వరకు యూజర్ చార్జీలు, ప్లాస్టిక్ కవర్ల వాడకంపై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ సచివాలయ సిబ్బందితో కలిసి ఈ ప్రాంతాల్లోని షాపులన్నింటినీ సందర్శించి యూజర్ చార్జీలను వసూలు చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, యూజర్ చార్జీలు చెల్లించని వారిపై, ప్లాస్టిక్ వాడుతున్న వారిపై జరిమానా విధించారు. 10 షాపుల నుంచి యూజర్ చార్జీలు రూ.20 వేలు, ప్లాస్టిక్ నిషేధంపై 4 షాపుల నుంచి రూ.2 వేలు ఫైన్ కట్టించుకున్నట్టు డాక్టర్ రాజేష్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మర్రిపాలెం: జోన్–2 పరిధి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫీడర్, మర్రిపాలెం పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 11 కేవీ మర్రిపాలెం సెక్షన్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఫీడర్ నిర్వహణలో భాగంగా మర్రిపాలెం ఎస్టేట్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

నిరక్షరాస్యులపై సర్వే



సర్వే చేస్తున్న విద్యార్థినులు

మల్కాపురం: చదువు వెలుగు చూపుతుందని, ప్రతి ఒక్కరిలో అక్షర జ్ఞానం ఉండాలని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు అన్నారు. కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి చదువుకోలేని వారు ఎవరైనా ఉన్నారా అని సర్వే చేశారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం: సింహాచలంలో ఉన్న ట్రాన్స్‌కో టవర్‌లైన్స్ మెయిన్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం ఇందిరానగర్, నర్సింహనగర్, ఎన్ఏడీ, సుసర్ల కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, లక్ష్మీనగర్, ఉడా కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

బాలకృష్ణ ఫ్యాన్స్ అత్యుత్సాహం



అద్దాలు పగిలిన సినిమాహాలు గేటు తలుపు

గోపాలపట్నం: బాలకృష్ణ అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గోపాలపట్నం మౌర్య సినిమా హాల్లో వీరసింహారెడ్డి బెనిఫిట్ షో చూసేందుకు వచ్చిన అభిమానులు సినిమా హాలు గేటు అద్దాలను పగలగొట్టారు. దీంతో యాజమాన్యం వెంటనే అప్రమత్తమై జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఎవరికీ గాయాలు కాకుండా, గాజుపెంకులను తొలగించింది.

సంక్రాంతి సందడి

- 52వ వార్డులో ఘనంగా సంబరాలు
- ఎన్ఏడీ కేవీలో పండగ వాతావరణం
- ఆడిపాడిన చిన్నారులు



గంగిరెద్దుల విన్యాసాలను తిలకిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



52వ వార్డులో గాలిపటాలు ఎగరేస్తున్న చిన్నారులు



ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో పల్లెను తలపిస్తున్న ఏర్పాట్లు



సంప్రదాయ దుస్తుల్లో అలరిస్తున్న కేవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: నియోజకవర్గంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 52వ వార్డులోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం పక్కనున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వీటిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. మహిళలు, యువతులు ఇక్కడి ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. భోగి మంటలు వేసి వాటి చుట్టూ సంప్రదాయ నృత్యాలు చేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగరేసి కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సంక్రాంతి పండగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని జియ్యాని శ్రీధర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, ఏపీ హోటల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పవన్‌కార్తీక్, నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు, జియ్యాని మారుతి, జియ్యాని విజయ్, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో..

నేవల్ ఆర్మమెంట్ డిపో కేంద్రీయ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ ప్రారంభించి మాట్లాడుతూ రెండేళ్ల తరువాత తమ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యాలయంలో పల్లె వాతావరణాన్ని సృష్టించారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు ముచ్చట గొలిపారు. భోగి మంటల చుట్టు డ్యాన్స్‌లు వేస్తూ పాటలు పాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, పండగల విశేషాల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. చిన్నరులపై భోగి పల్లు వేసి నిండు నూరేళ్లు జీవించాలని దీవించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సి.పాలి, వ్యాయామ ఉపాధ్యాయిని కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రంలో..

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక నేతృత్వంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా వైద్య సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆరోగ్య కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి ముగ్గు వద్ద వైద్య సిబ్బంది

శేషాద్రి హిల్స్‌లో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పాతగోపాలపట్నం శేషాద్రి హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న పాల్గొని స్థానికులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గులను పరిశీలించిన అనంతరం విజేతలకు ఆమె బహుమతులు అందించారు. కార్యక్రమంలో అప్పలస్వామి, అపార్ట్‌మెంట్ కార్యదర్శి శ్రీనివాస్, మూర్తి, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలని ఆందోళన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్)ను రద్దు చేసి, పాత విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ క్యారేజ్ అండ్ వేగన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. మర్రిపాలెంలోని క్యారేజ్ అండ్ వేగన్ బ్రాంచ్ కార్యాలయం వద్ద జాతీయ యువజన దినోత్సవాన్ని ఓల్డ్ పెన్షన్ డేగా నిర్ణయించి దీనికోసం కార్మికులందరూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్యారేజ్ అండ్ వేగన్ బ్రాంచ్ సెక్రటరీ సూర్యప్రకాష్, ప్రెసిడెంట్ రవికుమార్, ట్రెజరర్ దిలీప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా గర్జనను విజయవంతం చేయాలి

పెదగంట్యాడ: ఈ నెల 30న ఉక్కునగరంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. పెదగంట్యాడ ఉక్కు కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో ఇంటక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు గొందేశి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన అఖిల పక్ష కార్మిక సంఘాలు, రాజకీయ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజా గర్జనను విజయవంతం చేసేందుకు నిర్వాసిత కాలనీల్లో విస్తృతంగా పాదయాత్రలు చేపట్టాలని కోరారు. సమావేశంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ గొందేశి సత్యారావు, నెల్లి అప్పలరాజు, ఎల్లేటి శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, మంత్రి గోపీనారాయణ, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెహరా ఆస్పత్రికి 'ఆరోగ్యశ్రీ' అనుమతులు



వివరాలు వెల్లడిస్తున్న బెహరా విజయ్‌రవితేజ

గోపాలపట్నం: బెహరా హాస్పిటల్‌కు ఆరోగ్యశ్రీ పథకం అనుమతులు వచ్చాయని ఆస్పత్రి డైరెక్టర్ బెహరా విజయరవితేజ తెలిపారు. గోపాలపట్నంలోని ఆస్పత్రిలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. హాస్పిటల్‌ను ఏర్పాటు చేసిన ఆరు నెలల్లో 1,300 మందికి వైద్య సేవలు అందించామని చెప్పారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా 13 వేల మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. ఇందులో మధుమేహంతో బాధపడుతున్న 5 వేల మందికి బెహరా ఆస్పత్రి పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు. బ్రెయిన్ ఇంజ్యూరీస్, ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన కేసులను సైతం బాగు చేసి పూర్తి ఆరోగ్యంతో ఇంటికి పంపామని చెప్పారు. ఆరోగ్యశ్రీలో సర్జికల్ బ్రాంచ్‌గా గుర్తింపు వచ్చిందన్నారు. ఇందులో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, యూరాలజీ, ఈఎన్‌టీలో సర్జరీల వరకు ఆపరేషన్లు చేస్తామని వివరించారు. త్వరలో ఈ ఆస్పత్రికి మరింత ఆధునిక ఎక్విప్‌మెంట్ రానుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆస్పత్రిలో ప్రతి నెలా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆధార్ కార్డు లేని పేదల్లో ఒకరికి ప్రతి నెలా ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు.

70 ఏళ్లు దాటిన వారికి ఫ్రీ హెల్త్ కార్డుల ద్వారా వైద్యం అందిస్తామన్నారు. ఆర్ఎంపీ వారికి నెలకోసారి ఉచితంగా వైద్య చేస్తామని విజయరవితేజ చెప్పారు. మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.వి.లక్ష్మి ప్రావీణ్య, డాక్టర్ కర్రి ఉదయ్‌భాస్కర్, అనంత్‌కుమార్, నవీన్ చంద్ పాల్గొన్నారు.

పండగ వేళ అప్రమత్తత అవసరం

- ఊరు వెళ్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి
- ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ
- పోలీసుల విస్తృత ప్రచారం



తోటపోలమాంబ ఆలయం వద్ద అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ దుర్గాప్రసాద్



మల్కాపురం స్టేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోపాలపట్నం: పండగ వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ పెంటారావు, సీఐ కూన దుర్గాప్రసాద్ తెలిపారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని తోటపోలమాంబ ఆలయం వద్ద గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేరాల నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. పండగ సమయాల్లో సొంత గ్రామాలకు వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని కోరారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వాడుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఎస్ఐ నర్సింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త

మల్కాపురం: సంక్రాంతి పండగకు ఊళ్లు వెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచరాదని మల్కాపురం క్రైం ఎస్ఐ శంకరరావు సూచించారు. ఇంటి చుట్టుపక్కల వారికి ఊరికి వెళ్తున్న విషయం తెలియజేయాలని, ఎక్కువ రోజులు ఊరిలో ఉండవలసి వస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. మల్కాపురం, శ్రీహరిపురం ప్రధాన కూడళ్ల వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో శంకరరావు మాట్లాడారు. ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చుకుంటే మేలని సూచించారు. అపరిచితులను ఇంటి లోపలికి అనుమతించరాదన్నారు. తమ ఇంటి పరిసరాలలో అనుమానితులు కనిపిస్తే వెంటనే 100 కు ఫోన్ చేయాలని సూచించారు. దొంగలు వివిధ వేషాలతో వస్తుంటారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో క్రైం పోలీస్ మురళి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత వివేకానంద



వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఏ రహమాన్, జియ్యాని శ్రీధర్ తదితరులు

గోపాలపట్నం: భారతదేశ సంస్కృతీ, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు వివేకానందుడు యువతకు స్ఫూర్తిప్రదాత అని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. వివేకానందుడి జయంతిని జీవీఎంసీ 52వ వార్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్ఏ రెహమాన్ పాల్గొని, వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీధర్ మాట్లాడుతూ వివేకానందుడి ఉపన్యాసాలు మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్ వంటివారిని ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. కార్యక్రమంలో వెదుళ్ల శ్రీనివాసరావు, రామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం

మల్కాపురం: వివేకానందుడి బోధనలు ఆదర్శనీయమని 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ పి.వి.సురేష్ అన్నారు. వార్డు పరిధిలోని జవహర్ నగర్ వద్ద గల స్వామి వివేకానంద పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం వివేకానందుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్‌తో పాటు 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పాల్గొన్నారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించాల్సిన స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని, దేశం కోసం జీవిస్తే చాలని అన్నారు. యువత స్వార్థాన్ని విడనాడి, అందరి శ్రేయస్సును కాంక్షించాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

- 59వ వార్డు శాంతిగిరి కాలనీ వద్ద బీజేపీ నగర నాయకులు పాలిమేర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు కొక్కలిగడ్డ విజయబాబు, మలకపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొని, వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల వద్ద స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



శాంతిగిరి కాలనీ వద్ద వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బాక్సింగ్ చాంపియన్‌షిప్ విజేతలకు సత్కారం



విజేతలను అభినందిస్తున్న గొర్లె చందు, రఘురామ్

కంచరపాలెం: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విశాఖ క్రీడాకారులు, రన్నర్స్ అనకాపల్లి క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ప్రతిభ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలను ముఖ్య అతిథులు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, చీఫ్ అడ్వైజర్ గొర్లె చందు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బెస్ట్ బాక్సర్స్, బెస్ట్ పర్‌ఫార్మర్స్ కె.భవాని ప్రసాద్, సెక్రటరీ అమ్మోరు, ఆర్‌వోసీ రోబిన్, కోచ్‌లు శ్రీను, శివ, సత్యనారాయణలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిఫరీస్ ఎస్.భద్రయ్య, బి.కనకరాజు, బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 700వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ట్రాఫిక్ మరియు పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షల్లో పాల్గొన్న సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. మహనీయుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైన సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తామన్నారు. ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనలో కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, గంధం వెంకటరావు, అయోధ్యరామ్, కారునాయుడు, జె.రామకృష్ణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సింహగిరిపై కొనసాగుతున్న ధారోత్సవాలు



వెంకటాద్రిపై గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు రామానుజమ్



అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం : సింహగిరిపై మూడవరోజు గురువారం ధారోత్సవాలను విశేషంగా నిర్వహించారు. ఉదయం గోదాదేవి అమ్మవారు, చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో తిరువీధిగా ఆలయ ఈశాన్య దిక్కులో ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లని వేంజేపచేశారు. గంగధార జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి గంగధార వద్ద మండపంలో వేంజేపచేశారు. పాశుర విన్నప పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాస పూజలు

సింహాచలం : పెందుర్తి వెంకటాద్రిపై గురువారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేషంగా తిరుప్పావై సేవాకాలం జరిపించారు. గోదాదేవికి, వేంకటేశ్వరస్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ ఈ పూజలు నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో..

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలను విశేషంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై వేంజేపచేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

రేపు అప్పన్న ఆలయంలో గోదా కల్యాణం

సింహాచలం : భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదాకల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు కల్యాణం జరుగుతుందని, ఆరోజు ఉదయం 9.30గంటలకు నిర్వహించాల్సిన స్వామివారి నిత్యకల్యాణాన్ని గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా కోరారు.

పారిశ్రామిక వాడపై మంచు దుప్పటి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో నివాసులు వణికిపోతున్నారు. ఊటీని తలపించేలా వేకువజాము సమయంలో ఇక్కడి రహదారులను మంచు దుప్పటి కప్పేస్తుండటంతో యువత ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తున్నారు. వృద్ధులు గజగజలాడుతున్నారు. గురువారం ఉదయం మల్కాపురం ఐవోసీ రహదారిలోని పంప్‌హౌస్ ప్రాంతంలో పచ్చని చెట్ల నడుమ పొగ మంచు జారుతున్నట్టు కనిపించడంతో అటువైపు రాకపోకలు సాగించిన వారు ఆహ్లాదం పొందారు. అరకు, ఊటీ వంటి పర్యాటక ప్రాంతాల్లో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తాయని, పంప్‌హౌస్ వద్ద మంచు దుప్పటి కనువిందు చేసిందని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు.



పంప్‌హౌస్ ప్రాంతంలో మంచు సోయగం